## కథ

# వామనరావు రచయిత కాగలడా?

**హైస్కూల్లో చదివే రోజుల్లోనే వామనరావుకి రచయిత అవాలనే కోరిక పుట్టింది. ఒకసారి వాళ్ళ లెక్కల మాష్టారు క్లాసులో పిల్లల్ని ఒక్కొక్కరినీ లేపి వాళ్ళు పెద్దయ్యాక ఏమి అవదలచుకుంటున్నారని అడిగాడు. ఒక పిల్లాడు డాక్టరవుతానని, ఇంకొకడు ఇంజనీరవుతానని, మరొకడు టీచరవుతాననీ అంటే వామనరావు మాత్రం తను పెద్దయ్యాక రచయితనవుతానని చెప్పాడు. ఆ మాట ఆ నోటా ఈ నోటా పడి వామనరావు తండ్రి వరకూ వెళ్ళింది. అంతే! ఆయన అగ్గిమీద గుగ్గిలం అయ్యాడు.**

''ముందర క్లాసు పుస్తకాలు చదివి ఏడువ్. తిక్క వేషాలేసి తక్కువ మార్కులు తెచ్చుకుంటే కాళ్ళిరగ్గొడతా వెధవకానా'' అని హుంకరించాడు.

అసలు మామూలుగా తండ్రి అంటేనే చచ్చేంత భయం వామనరావుకి. ఇప్పుడు ఉగ్ర రూపంలో ఉన్న తండ్రిని చూడగానే శత్రుదేశపు సైనికులకి చిక్కిన యుద్ధఖైదీలా గడగడలాడిపోయాడు. తను రచయిత అయ్యే ప్రయత్నాన్ని తాత్కాలికంగా విరమించుకున్నాడు వామనరావు.

ఎలాగోలాగు చదువయ్యి ఉద్యోగంలో ప్రవేశించాడు. రచయిత అవాలనే ప్రగాఢవాంఛ మళ్ళీ బుసకొట్టింది వామనరావులో.

చొక్కా బొత్తం కొరుక్కుంటూ శూన్యంలోకి చూస్తూ ఏ సబ్జెక్టు మీద కథ రాయాలా అని ఆలోచిస్తున్న వామనరావుని చూసి అతని తండ్రి అతని ప్రవర్తనకి వేరే అర్థం తీసుకున్నాడు. ఆముదాలవలసలో ఉంటున్న తన చెల్లెలి కూతురు సుబ్బలక్ష్మితో వామనరావు పెళ్ళి జరిపించేశాడు. పెళ్ళయిన కొత్త-అందులో ముద్దబంతిలాంటి భార్యమీద మోజుతో రచయిత అవాలనే సంగతి మర్చిపోయాడు వామనరావు. అలా కొన్నాళ్ళు గడిచాక సంసారం రొటీన్‌గా మారిపోయాక కానీ తన జీవితాశయం గుర్తుకు రాలేదు వామనరావుకి. ఈలోగా అతడికి హైదరాబాదు ట్రాన్స్‌ఫరైంది. తండ్రి కూడా తనతోపాటు హైదరాబాదు వస్తానంటాడేమో అని భయపడ్డాడు వామనరావు. ఎందుకంటే గండుపిల్లిలాంటి తండ్రి ముందు చిట్టెలుకలాంటి వామనరావు స్వేచ్ఛగా ఆలోచించలేడు కాబట్టి.

''పొలము, పుట్రా, పాల వ్యాపారం, పాడిగేదెల్ని వదిలి నీతో ఎలా వస్తానురా గాడిదా'' అన్నాడు వామనరావు తండ్రి.

తనని గాడిదతో పోల్చి తనకన్నా పాడిగేదే నయమని తండ్రి తనకి అన్యాపదేశంగా చెప్పినట్టా అని ఆలోచించాడు వామనరావు. ఏది ఏమైనా గానీ తండ్రి తనతో రావట్లేదు కనుక మనసులోనే పొంగిపోయాడు. హైదరాబాద్‌లో ఓ మంచి అపార్ట్‌మెంట్‌లో సుబ్బలక్ష్మితో సహా సెటిలైపోయిన వామనరావు తాలిబన్ల పాలన నుండి విముక్తుడైన ఆఫ్ఘన్ పౌరుడిలా స్వేచ్ఛావాయువులు పీల్చుకోవడం మొదలుపెట్టాడు. అన్నాళ్ళూ మనసు మూలల్లో అణిగిపోయిన కోరిక కొరివిదయ్యంలా పట్టి పీడించటం మొదలుపెట్టింది. ఇహ లాభం లేదు. ఏదో ఒక కథ రాయనిదే ఈ కడుపునెప్పి తగ్గేట్టు లేదని ఓ శుభముహూర్తాన దుష్ట ఘడియలు లేకుండా చూసుకొని పేపర్లు ముందేసుకుని కలం పట్టుకు కూర్చున్నాడు. కథ రాయాలన్న తపనేగానీ ఇంతవరకూ పొడుపు కథ కూడా రాసిన అనుభవం లేదు తనకి. అలవాటు లేని ఔపోసన అయినా సరే పట్టువదలని విక్రమార్కుడిలా పేపర్లతో కుస్తీపట్టడం మొదలుపెట్టాడు.

తన భర్త రచయిత అయ్యే ప్రయత్నంలో ఉన్నాడని తెలుసుకున్న సుబ్బలక్ష్మి మురిసిపోయింది. గంట గంటకి టీ సప్లై చేస్తూ అతడు పేపరు మీద ఎప్పుడు పెన్ను పెడతాడా అని ఎదురు. చూసి చూసీ..విసిగిపోయింది. క్రమంగా సుబ్బలక్ష్మి ప్రవర్తనలో కూడా మార్పు రావడం మొదలుపెట్టింది.

''ఆఫీసు మానేసి అలా గంటలు గంటలు ఖాళీగా కూర్చోకపోతే బజారుకు వెళ్ళి కూరలు తేరాదా'' అనో ''చంటాడు పక్క తడిపితే పక్క గుడ్డలు మార్చమనో'' లాంటి పనులు పురమాయించడం మొదలుపెట్టింది. దాంతో వామనరావుకి చిర్రెత్తుకొచ్చేది. అసలు భార్యని పుట్టింటికి పంపేస్తే కానీ తనకి మనశ్శాంతి ఉండదని అనుకున్నాడు. తగిన కారణం లేకుండా ఎలా పంపాలా అనుకుంటుండగా-

''ఏమండీ మా వదిన కేదారేశ్వరుడి నోము నోచుకుంటోందట. నన్ను రమ్మని ఉత్తరం రాసింది వెళ్ళనా'' అన్నది సుబ్బలక్ష్మి.

''తప్పకుండా వెళ్ళు'' అన్నాడు వామనరావు.

భార్యని బస్సెక్కించి ఆటోకి చిల్లర కావాల్సొచ్చి పాన్‌షాపులో ఓ వారపత్రిక కొనియాభైకి చిల్లర తీసుకున్నాడు వామనరావు. యధాలాపంగా పత్రిక పేజీలు తిరగేస్తున్న వామనరావు చూపు ఓ పేజీలోని ప్రకటన మీద గమ్మేసి అతికించినట్టుగా అతుక్కుపోయింది. ఓ నవలల పోటీకి సంబంధించిన ప్రకటన అది. మొదటి బెస్టు నవలకి పాతిక వేలు ప్రయిజు అని చదివేసరికి వామనరావులో ఉత్సాహం ఉరకలు వేసింది. ఏ పని చేసినా నలుగురినీ సలహా అడిగి చెయ్యమన్నారు పెద్దలు. అందుకే ఆరోజు తన ఆంతరంగిక మిత్రులందరినీ హోటల్ 'అప్సరా'లో సమావేశపరిచాడు.

వామనరావు పెట్టించిన చికెన్ బిర్యాని తింటూ అతని ప్రయత్నాన్ని అభినందించారందరూ.

తెలుగు సబ్జక్ట్‌లో డిగ్రీ చేసిన ఆనందరావు సలహా యిస్తూ ''చూడు వామనరావ్! రచన చేయడమంటే స్విచ్చి వేయగానే వెలిగే బల్బు కాదయ్యా. పూర్వం కవులు రచనలు చేయడానికి కొన్ని ప్రత్యేక పరిస్థితులు కావాలన్నారు. నిరుపహతి స్థలము, రమణీయ ప్రియదూతిక తెచ్చి యిచ్చు కప్పుర విడెము, ఆత్మకింపయిన భోజనము..ఊయల మంచము..''

''ఈమధ్య కాలంలో బాగా సక్సెస్ అయిన సినిమాలు వరసపెట్టి చూడు గురూ..ఆ కథలని క్లబ్ చేసి కాస్త అటూ ఇటూ సన్నివేశాలని మార్చి రాసిపారేయ్. నీ నవల సక్సెస్ కాకపోతే



న న్న
డుగు.'' వామనరావ్ డబ్బులతో ఇప్పించిన మందు తాగుతూ అన్నాడు లోకనాథం.

''అసలు కథలూ కాకరకాయలూ అని ఎందుకన్నారో తెలుసా! ఏ కథ అయినా సరైన పట్టులేకుండా చెపితే కాకరకాయలా చేదుగా ఉంటుందని. నువ్వు రాసే నవలలో ఎక్కడికక్కడ సస్పెన్సలూ, ఊహించలేని మలుపులూ తిప్పు. అదే నీ నవల విజయానికి దగ్గర దోవ'' అన్నాడు సన్యాసిరావు.

మొత్తానికి ఫ్రెండ్స్ అందరూ అతడో గొప్ప రచయిత అవాలనీ నేటి వామనరావే రేపటి రచనా రంగంలో త్రివిక్రముడై చెలరేగి పోవాలని అతడిని ఆశీర్వదించి వామనరావు ఇప్పించిన

టి ెన
ళ్లన్నీ కడుపారా ఆరగించి ఆయాస పడుతూ ఇళ్ళకెళ్ళిపోయారు.

ఎలాగైనా మంచి నవల రాసి పాతికవేలు కొట్టేయాలనే దృఢ నిశ్చయంతో వామనరావు ఆఫీసుకి ఓ నెలరోజులు శెలవుపెట్టి ఓ నాలుగు రీములు తెల్లకాగితాలు, ఓ డజను జోటర్ రీఫిల్స్ కొని తెచ్చుకున్నాడు. శ్రీకృష్ణుడికి నెమలిపింఛంలా, శివుడికి నాగాభరణంలా రచయితకి సిగరెట్టు అలంకారం అని తలచి ఓ డజను సిగరెట్ ప్యాకెట్స్ దగ్గరుంచుకున్నాడు.

★ ★ ★

వామనరావు తన నవల పూర్తయ్యేవరకూ ఏ విఘ్నం కలగకూడదని తన ఇష్టదైవమైన వినాయకుడిని ప్రార్థించాడు. 'శుక్లాంబరధరం' చదువుకున్నాడు. 'అటుకులు కొబ్బరి పలుకులు' పద్యం చదివాడు. బుర్ర చురుగ్గా పని చేయాలని సిగరెట్ వెలిగించాడు. సిగరెట్ అయిపోయింది గానీ నవలకి కావలసిన సబ్జెక్టు ఏదీ దొరకలేదు. విసుగ్గా జుట్టు పీక్కున్నాడు.

ఆదుర్తి బాల

బుంర్ర
కేమీ తట్టలేదు.

మళ్ళీ సిగరెట్టు వెలిగించాడు.

మళ్ళీ జుట్టు పీక్కున్నాడు.

మళ్ళీసిగరెట్టు.

మళ్ళీ జుట్టు.

తన రచనా వ్యాసంగమనే యజ్ఞంలో పడి మాడిపోయిన సమిధల్లా సిగరెట్టు పీకల గుట్ట తయారైంది. తల మీద చెయ్యి పెట్టి ఎందుకో అనుమానమొచ్చి అద్దంలో చూసుకున్నాడు వామనరావ్. బుర్ర మూడు వంతులు బోడిగుండైంది. ఉలిక్కిపడ్డాడు వామనరావ్. తుమ్మెద రెక్కల్లాంటి ఉంగరాల జుట్టు ఊడ పీక్కున్నందుకు తనని తనే తిట్టుకున్నాడు. ఇక జుట్టు పీక్కోకూడదని మనసులో ఒట్టుపెట్టుకున్నాడు.

ఇహ ఇలా లాభం లేదని టి.వి. ఆన్ చేశాడు. ఏడుపుగొట్టు సీరియల్ ఏదో వస్తోంది. హీరోయిన్ అందంగా ఏడుస్తూ చెప్పిన డైలాగే మళ్ళీ చెప్తోంది. రింగ్ అవుతున్న ఫోన్ తీయాలా వద్దా అనే జంజాటంలో ఒక్కొక్క అడుగే వేస్తూ

ఫోన్ తీసింది. నాలుగు అడుగుల దూరం నడవడానికి ఐదు నిమిషాలు... ప్రేక్షకుల సహనానికి పరీక్ష పెడుతున్న సీరియల్‌ని చూస్తున్న వామనరావుకి వెర్రెక్కిపోయి టి.వి. కట్టేశాడు టక్కున.

టి.వి. ఆపేసినా దాని తాలూకు ప్రభావం ఇంకా వామనరావు మీద పనిచేస్తూనే ఉంది. చెప్పిన విషయాన్నే తిప్పి తిప్పి చెప్పడమెలాగో అర్థమైంది వామనరరావుకి. అలా కొన్ని పేజీలు నింపచ్చు అనుకున్నాడు. కథ ముందుకి జరగడం కష్టమైన చోట జరిగిపోయిన కథనే హీరోనో హీరోయినో గుర్తు చేసుకుంటున్నట్టు తిరిగి రాసి మరికొన్ని పేజీలు నింపొచ్చు. హనుమంతుడి తోకలా తన నవల ఎలా పొడిగించవచ్చో తెలుసుకున్న వామనరావు క్షణం ఆలస్యం చేయలేదు. తోక దొరికితే చాలు పీకల దాకా పోయే రకం మరి.

పుంఖాను పుంఖాలుగా కాగితాలు రాసిపారేస్తున్నాడు వామనరావు. మధ్యలో సరిగా రాయడం కుదరని పేపర్లు కిటికీలోంచీ బైటకి గిరాటేస్తున్నాడు. అలా..అలా..చెయ్యి నొప్పెట్టే వరకూ రాస్తూనే వున్నాడు. ఇంతలో వీధిలో ఏదో కలకలం..ఎవరో పెద్దగా అరుస్తున్నారు. ఏమిటా అని కిటికీ లోంచి చూశాడు వామనరావ్. అక్కడ కాగితాలేరుకునే కుర్రాళ్ళు వామనరావు పడేసిన కాగితాల కోసం ఒకళ్ళమీద ఒకళ్ళు కలబడి కొట్టుకుంటున్నారు.

మొత్తానికి తన నవల పూర్తి చేసి పత్రికకి పంపించాడు వామనరావ్. సద్దాంని పట్టి బంధించిన తర్వాత అమెరికా ప్రెసిడెంట్ పొందినంత మనశ్శాంతిని పొందాడు వామనరావు.

★ ★ ★

ఆ రోజు హాయిగా భోజనం చేసి, చేసే పనేం లేక గుర్రుకొట్టి నిద్రపోయాడు వామనరావ్.


''ఏమండీ మీ నవలకి ఫస్ట్ ప్రయిజ్ వచ్చిందండి'' కుదిపి కుదిపి లేపుతోంది సుబ్బలక్ష్మి.

''హో'' పట్టలేని ఆనందంతో సుబ్బలక్ష్మిని వాటేసుకున్నాడు వామనరావ్.

''నాన్నా నీకే ఫోన్'' వామనరావ్ పెద్ద కొడుకు ఫోనందించాడు.

''కంగ్రాట్స్ వామనా...మాకు పార్టీ ఎప్పుడిస్తావ్''

ఫోన్ చేసి మిత్రులందరూ అభినందనలు చెబుతున్నారు.




''ఏమండి రామానాయుడుగారు మీ నవల సినిమా తీస్తారుట. మిమ్మల్ని ఎప్పుడు కలుసుకోవాలని అడుగుతున్నారు'' సుబ్బలక్ష్మి.

''ఇప్పుడు టైం లేదు నా పి.ఏ.నడిగి అపాయింట్‌మెంట్ తీసుకోమను'' వామనరావ్.

''ఏమండీ మళ్ళీ ఫోను-'' సుబ్బలక్ష్మి.

''ఏ రాఘవేంద్రరావో అయ్యుంటాడు చాలా బిజీగా ఉన్నానని చెప్పు''

''ఇదిగో మిమ్మల్నే'' తలమీద ఠంగుమని తగలిందేదో..అబ్బా అనుకుంటూ లేచి కూర్చున్నాడు వామనరావ్. ఎదురుగా అప్పడాల కర్రతో సుబ్బలక్ష్మి.

''ఇందాకట్నించి చూస్తున్నాను...మీలో మీరే అరుపులు కేకలూనూ'' బొప్పికట్టిన తలమీద చెయ్యేసి రుద్దుకుంటూ ''మరి నా నవల రామానాయుడు..సినిమా..'' గొణుక్కుంటున్నాడు వామనరావ్.

''ఇదుగో మీ నవల..'' తిరిగొచ్చిన నవలని వామనరావ్ చేతిలో పెట్టింది సుబ్బలక్ష్మి.

ఫోన్ మోగింది. నీరసంగా రిసీవర్ తీసి హలో అన్నాడు వామనరావు.



## ఇమేజ్‌ని పాడుచేసుకోను!

**తెలుగు నుంచి ఇప్పుడు తమిళ రంగానికెళ్లిన శ్రీయ నటిస్తున్న 'వర్షం' తమిళ వెర్షన్‌లో ఆమె ముద్దు సీన్‌లో నటించిందనే వార్త ఒక్కసారిగా గుప్పుమందీ మధ్య. దానికి శ్రీయ వెంటనే రెస్పాండ్ అవుతూ- "నేను గ్లామర్‌గా నటించడానికి ఇష్టపడతాను కానీ ఇలా ముద్దు సీన్లలో ఎప్పటికీ నటించను. ఇలాంటి రూమర్ ఎందుకు పుట్టిందో నాకర్థం కాదు. నా ఇమేజ్‌ని పాడుచేసుకునే విధంగా నేనెప్పుడూ ప్రవర్తించను. గ్లామరస్, టాలెంటెడ్ నటిగా పేరు తెచ్చుకోవాలన్నదే నా అభిమతం" అంటూ ముద్దు సీన్లపై తన వ్యతిరేకతని తెలియచేసింది.**

''ఒరే బడుద్దాయ్ కథలూ, రచనలూ అంటూ ఇంట్లో ఏమీ పట్టించుకోకుంటల్లేదుట. ఆసక్తి ఉన్న వాళ్ళంతా రచయితలు అవలేరురా శుంఠా...ముందర మన రామాయణం, భారతం చదువు. తరువాత పెద్ద పెద్ద రచయితలు రాసిన సాహిత్యం చదివి వంటపట్టించుకో. ఆ తర్వాత ప్రయత్నం చేయ్'' తండ్రి జ్ఞానోపదేశం చేస్తున్నాడు.

నిట్టూర్చాడు వామనరావు. తండ్రి చెప్పినవన్నీ చేసే ఓపిక తనకి ఉందా అనుకుంటూ.